క్లుప్తంగా

విరాళాల సేకరణ



పాన్‌గల్: జనవరిలో సంగారెడ్డిలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలకు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కేతేపల్లిలో ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించినట్లు మండల కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, అభిమానులు విరాళాలను స్వచ్ఛందంగా అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందన్నారు. కార్యక్రమంలో భగత్, భీమయ్య, సురేందర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు



అమరచింత: మండలంలోని ఈర్లదిన్నెలో వెలసిన శ్రీసయ్యద్‌షా మహబూబ్ ఉస్సేనీ దర్గా ఉర్సు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరూ దర్గా వద్దకు చేరుకొని కందూర్లను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహబూబ్ ఉస్సేనీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పూల చాదర్లను సమర్పించారు.

కోటిలింగేశ్వరుడికి ఆరుద్రపూజలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి సమీపంలో గల శ్రీకోటిలింగేశ్వర దత్త దేవస్థానంలో సోమవారం మార్గశిర మాసం పురస్కరించుకొని ఏకాదశ రుద్రాభిషేక పూజలు చేశారు. శివుడి జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో భక్తులు ఉదయం నుంచి ఆలయానికి అధిక సంఖ్యలో చేరుకొని భక్తిశ్రద్ధలతో శ్రీకోటిలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మార్మోగాయి. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆటో, కారు ఢీ: ఇద్దరికి గాయాలు



వనపర్తి రూరల్: కారు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన ఘటన సోమవారం మండలంలోని కిష్టగిరి సమీపంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములకు చెందిన చంద్రకళకు వారం రోజుల క్రితం వనపర్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాన్పు అయింది. మళ్లీ ఆస్పత్రిలో చూపించుకోవడానికి మంగళవారం చంద్రకళ తనతో పాపతో పాటు తల్లి లక్ష్మి, నాయనమ్మ శాంతమ్మతో కలిసి ఆటోలో వనపర్తికి వస్తుండగా మార్గమధ్యలో వనపర్తి నుంచి వస్తున్న కారు కిష్టగిరి సమీపంలో ఆటోను ఢీకొట్టడంతో.. ఆటో రోడ్డు పక్కకు బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ చిరంజీవి, లక్ష్మికి తలకు గాయాలు కాగా.. బాలింత చంద్రకళ, చిన్న పాప, శాంతమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

రెండు బైకులు ఢీ

వనపర్తి రూరల్: రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయిన ఘటన మండలంలోని రాజపేట సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణానికి చెందిన ప్రశాంత్‌కుమార్ కొత్తకోట నుంచి బైక్‌పై వనపర్తికి వస్తూ రాజపేటతండాకు చెందిన వర్షనాయక్ బైక్‌పై గ్రామం నుంచి వస్తుండగా రాజపేట బస్టాండ్ వద్ద రెండు బైకులు ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కావడంతో స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పీహెచ్‌సీలో మందుల కొరత




పాన్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- ఇబ్బందుల్లో రోగులు
- నిరాశతో వెనుదిరుగుతున్న వైనం

పాన్‌గల్: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు మండల కేంద్రాల్లో ఉన్న పీహెచ్‌సీలో సరిపడా మందులు లభించక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందులు లభించకపోవడంతో కొందరు రోగులు నిరాశతో వెనుదిరుగుతుంటే.. మరికొందరు ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసేందుకు వైద్యులతో స్లిప్పులు రాయించుకుంటున్నారు. పీహెచ్‌సీల్లో మందుల కొరతతో ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పోతుందని పలువురు విమర్శిస్తున్నారు.

మండలంలో..

మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 10 సబ్ సెంటర్ల పరిధిలో రేమద్దుల, తెల్లరాళ్లపల్లి, మాందాపూర్, అన్నారం, చింతకుంట, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాలు ఉన్నా అక్కడ విధులు నిర్వహించే ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు సమయపాలన పాటించకపోవడం, మధ్యాహ్నం తర్వాత కేంద్రాలను మూసి వెళ్లిపోతుండటంతో గ్రామీణులకు సరైన వైద్యం అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో చాలా మంది రోగులు మండల కేంద్రంలోని పీహెచ్‌సీకే వస్తుంటారు. ఇక్కడికి వచ్చిన వైద్యులు అందుబాటులో ఉన్నా సరిపడా మందులు దొరకపోవడంతో నిరాశ తప్పడంలేదు. పేరుకే మండల కేంద్రం తప్ప మందులు దొరకనప్పుడు ఆస్పత్రి ఎందుకు ఉన్నట్లు అని పలువురు రోగులు ప్రశ్నిస్తున్నారు. ఆస్పత్రిలో పెయిన్ కిల్లర్, యాంటిబయోటిక్, బీపీ మాత్రలు, రోగ నిరోధకశక్తి పెంచే మందుల కొరత ఉందని వాటి కోసం జిల్లా అధికారులకు నివేదించినట్లు సిబ్బంది పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని రోగులు కోరుతున్నారు.



పీహెచ్‌సీలో మందుల కొరతతో బయటికి రాసిన స్లిప్పు

వారం రోజుల నుంచి తిరుగుతున్నా..



మండల కేంద్రంలోని ఆస్పత్రికి బీపీ మాత్రల కోసం నాలుగు, ఐదు రోజుల నుంచి తిరుగుతున్నా. మాత్రలు లేవని పంపిస్తున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. పేద వారి కోసం ఉన్న ఆస్పత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచి ఇబ్బందులను తొలగించాలి.

– బుద్దమ్మ, పాన్‌గల్

ప్రైవేట్ దుకాణాల్లో..



కాలి నొప్పితో ఆస్పత్రికి వచ్చి వైద్యం చేయించుకున్నా. తర్వాత మాత్రలు లేవని చెప్పడంతో షాక్‌కు గురయ్యాను. మాత్రలు లేకుంటే ఏట్లా సారు.. అని అడిగితే ప్రభుత్వం నుంచి సరఫరా కాలేదని వైద్యులు చెప్పారు. అవసరమనుకుంటే స్లిప్పు రాసిస్తాం బయట తీసుకోమని చెప్పినట్లు ఆమె తెలిపింది.

– వెంకటమ్మ, కేతేపల్లి

మందుల కొరత వాస్తవమే

పీహెచ్‌సీల్లో మందుల కొరత ఉన్నది వాస్తవమే. ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్న వాటిని పీహెచ్‌సీలకు అందజేస్తున్నం. ఈ విషయాన్ని కలెక్టర్‌కు నివేదించాం. కొరత ఉన్న మందులు ప్రభుత్వం నుంచి అందిన వెంటనే పీహెచ్‌సీలకు సరఫరా చేస్తాం.

– డా.శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ, వనపర్తి

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

వీపనగండ్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ గోవర్ధనగిరిలో సీపీఎం నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని మండల సీపీఎం కార్యదర్శి బాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక్క గోవర్ధనగిరి గ్రామంలోనే తమ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లపై సర్వే నిర్వహించగా.. దాదాపు వంద ఇళ్లు అవసరమని గుర్తించామన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరు చేయాలని, గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పేరుతో ప్రజలను మోసగించిందని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తమ పార్టీ ముందుంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎండీ మహబూబ్‌పాషా, రవిప్రసాద్, కవిత, మాజీ సర్పంచ్ కాంతమ్మ, ఖాజాహుస్సేన్, మౌలాలి, శంకర్, లక్ష్మి, సరోజ, బాలీశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



గోవర్ధనగిరిలో రిలే దీక్షలు చేస్తున్న సీపీఎం నాయకులు

'సర్పంచ్ స్థానాన్ని ఎస్సీకి కేటాయించాలి'

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వెల్టూరు గ్రామ పంచాయతీ ఏర్పడిన తర్వాత 1954వ సంవత్సరం నుంచి నేటి వరకు 70ఏళ్లుగా సర్పంచ్ స్థానాన్ని ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించలేదని, 2025 సంవత్సరంలో జరిగే స్థానిక ఎన్నికల్లో సర్పంచ్ స్థానాన్ని ఎస్సీలకు కేటాయించాలని గ్రామానికి చెందిన పలువురు ఎస్సీలు సోమవారం పెద్దమందడి తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా దళిత నాయకుడు డీఎస్ మహేష్ మాట్లాడుతూ వెల్టూరు గ్రామ పంచాయతీలో దాదాపు 100 కుటుంబాలు, 500 ఓటరు జాబితా కలిగిన ఎస్సీలకు 1954 నుంచి నేటి వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం రాకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తమను గుర్తించి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ఏర్పుల రాములు, నాగభూషణ్ ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెల్టూర్ గ్రామ ఎస్సీ నాయకులు

అదుపు తప్పి చెరుకు ట్రాక్టర్ బోల్తా

కొత్తకోట రూరల్: అదుపుతప్పి చెరుకు ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన కొత్తకోట మండలంలోని అమడబాకుల స్టేజీ సమీపంలో జాతీయ రహదారి 44పై చోటు చేసుకుంది. ట్రాక్టర్ డ్రైవర్ తెలిపిన వివరాల మేరకు.. జోగులాంబ గద్వాల జిల్లా ఉప్పేరు నుంచి కొత్తకోట మండలంలోని అప్పరాల సమీపంలో ఉన్న కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకు లోడ్‌తో వెళ్తున్నామన్నారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ ట్రాలీ విడిపోవడంతో అదుపుతప్పి బోల్తా పడినట్లు డ్రైవర్ తెలిపారు. చెరుకు ట్రాక్టర్ రోడ్డుకు అడ్డంగా పడటంతో రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న హైవే సిబ్బంది, షుగర్ ఫ్యాక్టరీ సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకుని చెరుకును పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



రోడ్డుకు అడ్డంగా పడిన చెరుకు ట్రాక్టర్

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం

అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు భయపడుతున్నారు. పాఠశాలలో ఆంగ్ల మీడియంతో పాటు తెలుగు మీడియం ఆరు నుంచి పదో తరగతి వరకు కొనసాగుతున్నాయి. పాఠశాలలో సుమారు 380 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులు ఆడుకునే సమయంలో అటుగా వెళ్లాలంటే భయపడే పరిస్థితులు దాపరించాయి. వీటికి కంచె ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా ఫలితం లేక పోతుందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



పాఠశాల ఆవరణంలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

'చలో హైదరాబాద్' విజయవంతం చేయండి



పాన్‌గల్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 17న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సంఘం నాయకులు ఎల్లస్వామి, సుగ్రీవుడు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులతో కలిసి వారు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు నెల వారీగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి 51వ జీఓను సవరించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, బీమా సౌకర్యం రూ.10 లక్షలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పిస్తూ కార్మికులను కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. ఆయా డిమాండ్ల సాధనకు నిర్వహిస్తూ చలో హైదరాబాద్‌కు ప్రతి గ్రామం నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కొనసాగుతున్న తరగతి గదుల నిర్మాణం



అమరచింత: మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణంలో రూ.45 లక్షలతో నిర్మించనున్న రెండు తరగతి గదుల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం రెండు నెలల కిందట రూ.45 లక్షలు మంజూరు చేశారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. రెండు నెలల వ్యవధిలో తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేయడానికి ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ నరేష్ తెలిపారు. వీటితో పాఠశాలకు అదనంగా మరో రూ.26 లక్షలు తరగతి గది కోసం మంజూరయ్యాయని, వీటిని సైతం పూర్తి చేస్తున్నామన్నారు.

నేడు రైతు నేస్తం కార్యక్రమం

వీపనగండ్ల: యాసంగి పంటల సాగు, సస్యరక్షణ చర్యలు అనే అంశంపై మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే కార్యక్రమంలో డాక్టర్ మాలతి, ఆర్ సునీత, ఉదయ్‌శంకర్ పాల్గొని రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారని ఆయన తెలిపారు.

ధ్యానంపై విద్యార్థులకు అవగాహన

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం హార్ట్‌ఫుల్‌నెస్ జిల్లా సభ్యుడు మధుసూదన్ ఆధ్వర్యంలో ధ్యానంపై అవగాహన కల్పించారు. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించి వారితో ధ్యానం చేయించారు. ప్రతి రోజు ధ్యానానికి కొంత సమయం కేటాయిస్తే, మానసిక ప్రశాంతతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ధ్యానం చేయడంతో సంపూర్ణ ఏకాగ్రత చేకూరుతుందని వివరించారు. సమావేశంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మధుసూదన్

డీఎంఆర్ ట్రస్టు ద్వారా విద్యార్థినులకు అల్పాహారం



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ఉపాధ్యాయులు

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళ నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరయ్యే వారికి డీఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో అల్పాహారం అందిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యుడు శ్యాం తెలిపారు. పాఠశాలలో సోమవారం డీఎంఆర్ఎం ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన అల్పాహారం విద్యార్థినులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా డీఎంఆర్ ట్రస్టు ద్వారా మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్‌ఎం కరుణాకర్, ఉపాధ్యాయులు ఆదాం, విమల, శారద, సింగిల్‌విండో డైరెక్టర్ చిన్న వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీబీ, బీపీ వ్యాధుల నివారణపై అవగాహన

పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో టీబీ, బీపీ వ్యాధుల నివారణపై సోమవారం రోగులకు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. దీర్ఘకాలిక వ్యాధుల రాకుండా ఉండాలంటే ఆహారపు అలవాట్లు, జీవన శైలిలో మార్పు, రోజు వ్యాయామం చేయాలన్నారు. దీంతో పాటు అన్నం, ఇడ్లీ, దోశ, ఉప్మా వంటి ఆహారాన్ని తక్కువగా తీసుకోవాలని సూచించారు. జొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు వంటి వాటితో తయారయ్యే ఆహారం తినాలన్నారు. మోకాళ్ల నొప్పులకు ఇష్టానుసారంగా మందులను వాడొద్దని, వైద్యుడి సలహా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధితో భరోసా ఏర్పడుతుందని ఏఐసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్యారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మామిడిమాడ కు చెందిన వినోద్, ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన బాలమ్మ, రోడ్డుమీదితండాకు చెందిన ఎస్.జ్యోతి, కొత్తపల్లికి చెందిన సయ్యద్‌అహ్మద్, సోళీపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు, బాబు, దొంతికుంటతండాకు లలిత కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయిన చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంజాయి రమేష్‌తో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ల సెల్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, ఎం.దేవన్నయాదవ్, బాల్‌రెడ్డి, మున్నూరు జయకర్, యాదగిరి, నరేష్ యాదవ్, సయ్యద్‌అహ్మద్, అజీమ్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న ఆదిత్యారెడ్డి

బీజేపీ బలోపేతానికి కృషి

వనపర్తి రూరల్: మండలంలోని కిష్టగిరిలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు సంద వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షుడు రామన్న గారి వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై కార్యకర్తలతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి వివరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలిజేయాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బూత్ కమిటీ పటిష్టంగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 176 బూత్ కమిటీ అధ్యక్షుడిగా నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



అధ్యక్షుడికి నియామకపత్రం అందజేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

ఇళ్ల మధ్య పాడుబడిన బావి

అమరచింత: పట్టణంలోని శివాజీనగర్‌లో ఇళ్ల మధ్య ఉన్న నాగులబావి పాడుబావిగా మారినా అధికారులు దానిని పూడ్చే ప్రయత్నం చేయకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. షాదీఖానా సమీపంలో పాడుబావి ఉండటం, పంట పొలాలకు అక్కడి నుంచే కాలిబాట ఉండటంతో రైతులతో పాటు కాలనీ ప్రజలు, తండావాసులు వెళ్తుంటారు. పాడుబావిలో ఒకటో వార్డులోని ఆయా కాలనీలకు చెందిన మురుగు అంతా బావిలోకి చేరుతుండటంతో చుట్టుపక్కల దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నా సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రి వేళల్లో పొలాలకు వెళ్తున్న రైతులు కంచె లేని పాడుబావిలో జారిపడే ప్రమాదం ఉందని ఇప్పటికైనా బావిని పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.



శివాజీనగర్‌లో పాడుబావి

నాణ్యమైన ఆహారం వడ్డించాలి

పెద్దకొత్తపల్లి: విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం వడ్డించాలని డీఈఓ రమేష్ కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. వంటగదిలో నిల్వ ఉన్న సరుకులను, రికార్డులను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులకు గణిత పాఠాలు బోధించారు. నాణ్యతలేని కూరగాయాలతో వంటలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విద్యార్థులు అనారోగ్యానికి గురి అయితే మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనంతరం దుప్పట్లను విద్యార్థినులకు పంపిణీ చేశారు. కేజీబీవీల పర్యవేక్షణ అధికారిని శోభారాణి, ఏఎస్ఓ లత ఉన్నారు.



పాఠాలు బోధిస్తున్న డీఈఓ రమేష్ కుమార్

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

ఎర్రవల్లి: మండల పరిధిలోని వేముల గ్రామంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఈనెల 18 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.50,016, రెండో బహుమతి రూ.30,016, మూడో బహుమతి రూ.15,016 నగదు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.100 ఎంట్రీ ఫీజు చెల్లించి టీమ్ పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 93471 76286, 83094 18471 నంబర్లను సంప్రదించగలరని పేర్కొన్నారు.